ఆంధ్రప్రభ

# మెట్రో పనులకు హైకోర్టు

# స్టే ఆర్డర్ ఇవ్వలేదు



- మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి
- పాతనగరం మెట్రోరైల్ ప్రాజెక్టు విస్తరణ పనులపై వివరణ
- ఎటువంటి స్టేఆర్డర్ రాలేదని స్పష్టం
- ఇప్పటివరకు దాదాపు 311 ఆస్తుల స్వాధీనం
- నష్టపరిహారంగా రూ.283 కోట్లు అందజేత

హైదరాబాద్ (ఆంధ్రప్రభ) : పాతనగరంలో మెట్రోరైల్ పనులపై హైకోర్టు స్టేఆర్డర్ ఇచ్చిందంటూ కొన్ని వార్తా పత్రికలు, న్యూస్ ఛానళ్ళలో వచ్చిన వార్తలు అవాస్తవంగాను, తప్పుదారి పట్టించేవిగాను ఉన్నాయని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. మెట్రో పనులపై హైకోర్టు ఎటువంటి స్టేఆర్డర్ ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యుఎఫ్) దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంకు ప్రతిస్పందనగా హెచ్ఏఎంఎల్ హైకోర్టుకు గతంలో దాఖలు చేసిన కౌంటర్‌లో, పాతనగరంలో ఏ వారసత్వ నిర్మాణాన్ని తాకడం లేదా కూల్చివేయడం జరగదని విన్నవించినట్టు ఆయన వెల్లడించారు. చార్మినార్, ఫలక్‌నుమా చారిత్రాత్మక నిర్మాణాలు మెట్రో రైల్ అలైన్మెంట్‌కి దూరంగా ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. ఎటువంటి పురాతన కట్టడాలను, ప్రాంగణాలను తాకడం లేదా కూల్చివేయడం జరిగే ప్రసక్తే లేదని హెచ్ఏఎంఎల్ తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ న్యాయస్థానానికి హామీ ఇచ్చారని ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. ఆ తరువాత పిటిషనర్, హెచ్ఏఎంఎల్ అదనపు అఫిడవిట్లు, కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశారన్నారు. కొన్ని రోజుల క్రితం పిటిషనర్ దాఖలు చేసిన తాజా అదనపు అఫిడవిట్లకు అదనపు అడ్వకేట్ జనరల్ హెచ్ఏఎంఎల్ తరపున తన ప్రతిస్పందనను దాఖలు చేయడానికి కొంత సమయం కోరారని ఆయన చెప్పారు. హైకోర్టు సమగ్రమైన కౌంటర్ దాఖలు చేయడానికి 3 వారాల సమయం ఇచ్చిందని తెలిపారు. మధ్యంతర ఉపశమనం ఏదైనా ఇదివరకు ఇచ్చి ఉంటే, తదుపరి విచారణ తేదీ వరకు అది అమలులో ఉంటుందని మాత్రమే హైకోర్టు తన ఉత్తర్వులలో పేర్కొందని ఆయన వివరించారు. హైకోర్టు ఆదేశాలను వక్రీకరిస్తూ కొందరు తప్పుడు సమాచారం అందిస్తున్నారని ఆయన అన్నారు. ప్రభావిత ఆస్తుల యజమానులకు ఇచ్చే కన్సెంట్ అవార్డుల ఆధారంగా సముచితమైన పరిహారం చెల్లించిన తర్వాతే ప్రైవేట్ భవనాల కూల్చివేత పనులు జరుగుతున్నాయని ఆయన వివరించారు. పాత నగరంలో ఆస్తుల కూల్చివేతలో ఉన్న సవాళ్లను వివరిస్తూ, ఒకదానికొకటి అనుకోని ఉన్న భవనాలు, సంక్లిష్టంగా ముడిపడిన విద్యుత్, టెలికాం, ఇతర కేబుల్ వైర్లు ఉండటంతో, హెచ్ఏఎంఎల్ ఇంజినీర్లు మరియు అధికారులు రాత్రిపూట ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా వారసత్వ కట్టడాలను మినహాయించి మిగిలిన ప్రభావిత ఆస్తులను జాగ్రత్తగా కూల్చివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి వారు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. కన్సెంట్ అవార్డులకు అంగీకరించేలా ప్రభావిత ఆస్తుల యజమానులను ఒప్పించడంలో హెచ్ఏఎంఎల్ అధికారులు, ముఖ్యంగా మహిళా అధికారులు చేస్తున్న కృషిని ఎండీ రెడ్డి అభినందించారు. పాతనగర వాసులు ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలన్న ఆకాంక్షతో ఉత్సాహంగా తమ సహకారాన్ని అందించడం పట్ల మెట్రో ఎండీ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన పాతనగరంలో, మెట్రో రైల్ ప్రాజెక్టు పనుల ప్రగతిపై వారంతా సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. ఇప్పటివరకు దాదాపు 311 ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని, సహాయ పునరావాస నష్టపరిహారం కింద వాటి యజమానులకు ఇప్పటి వరకు రూ.283 కోట్లు పంపిణీ చేశామని ఆయన తెలిపారు.